ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 31 ఆగస్టు 2024


విచారణలో భాగంగా ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు



ప్రతీ ఎకరాకు గోదావరి నీరు

మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


సమ్మక్క బ్యారేజీని పరిశీలిస్తున్న మంత్రులు

- దేవాదులతో ఉమ్మడి వరంగల్ జిల్లా సస్యశ్యామలం
- కాలువల పునరుద్ధరణకు రూ.1,100కోట్లు
- పూర్తిదశకు పంప్‌హౌస్‌ల పనులు
- 3వేల ఎకరాల భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి దేవాదుల ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీల సందర్శన
- ఇన్‌టేక్‌వెల్ వద్ద ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష
- నియోజకవర్గాల సాగునీటి సమస్యను వివరించిన ఎమ్మెల్యేలు
- ములుగు జిల్లాలో లిఫ్టుల ఏర్పాటుకు మంత్రి ఉత్తమ్ సుముఖత

ములుగు/కన్నాయిగూడెం, ఆగస్టు 30: ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పక్కనే ఉన్న కరీంనగర్, భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లోని ప్రతీ ఎకరానికి గోదావరి జలాలను అందిస్తామని, ముఖ్యంగా 2026 మార్చి నాటికి దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నాడు ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్ వద్ద శంకుస్థాపన చేసిన సోనియా గాంధీని పనులు పూర్తయిన తర్వాత ఇక్కడికి తీసుకొచ్చి ప్రారంభింపజేస్తామని తెలిపారు. శుక్రవారం ఆయన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి దేవాదుల ఇన్‌టేక్‌వెల్, సమ్మక్క బ్యారేజీలను ఆయన సందర్శించారు. అనంతరం దేవాదుల వద్ద సాగునీటిరంగ అధికారులు, కాంట్రాకర్లతో సమీక్ష జరిపారు. మూడు దశల్లో జరుగుతున్న పనులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్న మంత్రులు పనుల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

300 రోజులు.. 60 టీఎంసీలు..

ఏడాదిలో 170 రోజులపాటు నీటిలభ్యత ఉంటే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసే విధంగా డిజైన్ చేసిన దేవాదుల ప్రాజెక్టు లక్ష్యాన్ని సమ్మక్క బ్యారేజీ ద్వారా విస్తరిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు దాన్ని విస్తరిస్తూ 300 రోజులపాటు 60 టీఎంసీల నీటిని పంపింగ్ చేసేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. సమ్మక్క బ్యారేజీకి నీటి కేటాయింపుల కోసం సీడబ్ల్యూసీ అనుమతులు తీసుకో వడంతోపాటు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ద్వారా ఎన్‌వోసీ కోసం సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. 20 పంప్‌హౌస్‌ల నిర్మాణ పనులు పూర్తి దశలో ఉన్నాయన్నారు. మూడో దశలో టన్నెల్ నిర్మాణం పూర్తయినాయని, ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ప్రెషర్‌మైన్ పనులను నవంబరులోగా పూర్తి చేస్తామని చెప్పారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టు పరిధిలోని కాల్వల్లో పూటిక పేరుకుపోవడం, చెట్లు మొలవడం, వరదలకు కొట్టుకు పోవడంతో ధ్వంసమయ్యాయని, వాటిని పునరుద్ధరిం చేందుకు రూ.1,100 కోట్లను మంజూరు చేస్తామని వెల్ల డించారు. 3 వేల ఎకరాల భూసేకరణ చేపడతామన్నారు.

భూములు మావే.. మునిగేది మేమే : సీతక్క

'ప్రాజెక్టు నిర్మాణాలకు భూములు మావి.. గోదావరి నీళ్లు మావి.. కానీ ఆయకట్టు మాత్రం ఎండుతోంది' అని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాజెక్టుల కింద భూములు కోల్పోవడమే కాక ఏటా వరదలకు ముంపునకు గురవుతున్న ములుగు జిల్లా రైతుల భూములకు చుక్క గోదావరి నీరు అందడంలేదని మంత్రి


దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల కింద నష్టపోయిన గంగారం, తుపాకులగూడెం ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గోదావరి నదిపై కొత్తగా లిఫ్టులు ఏర్పాటు చేసి కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట మండలాలకు నీళ్లివ్వాలని, రామప్ప-పాకాల లిఫ్టులో కొత్తగూడ, గంగారం మం డలాలకు న్యాయం చేయాలన్నారు. గ్రావిటీ కాల్వల ద్వారా నీటిని అందించాలన్నారు. రామప్ప-లక్నవరం భూసేకరణను సత్వరమే పూర్తిచేసి కాల్వను నిర్మించాలని కోరారు. మేడారం జాతరలోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామప్ప రిజర్వాయర్‌పై ఒత్తిడి తగ్గిస్తూ జాకారం, ఇంచెంచెర్వులను రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయాలన్నారు. మల్లూరు ప్రాజెక్టులోకి గౌరారం చెరువును మళ్లించాలన్నారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సీతక్క రాష్ట్రస్థాయిలో రాజకీయ నేతగా, సామాజిక వేత్తగా మంచి పేరుందని, ఆమె చేసిన ప్రతిపాదనలన్నింటినీ నెరవేర్చుతామని హామీ ఇచ్చారు.

గ్రీన్ చానెల్ ద్వారా నిధులు : పొంగులేటి

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, గ్రీన్ చానెల్ ద్వారా నిధులను కేటాయిస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.14వేల కోట్ల బిల్లుల నుంచి ఆర్థిక ఇబ్బందులున్నా చెల్లింపులు చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.7వేల కోట్లు క్లియర్ చేశామని అన్నారు. దేవాదుల ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి వరంగల్ జిల్లాకు వరప్రదాయినిగా మార్చుతామన్నారు.

సమీక్షలో కడియం మార్కు.. సమస్యలు తెలిపిన ఎమ్మెల్యేలు

తమతమ నియోజకవర్గాల్లోని సాగు నీటి సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రులకు వివరించారు. ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సాగునీటి రంగంలో తన అనుభవాన్ని సమీక్షలో వ్యక్తపరిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దాదాపు అన్ని పంప్‌హౌస్‌లు, కాల్వల స్థితిగతిని ఆయన ప్రస్తావించి పనుల వేగవంతానికి కీలక సూచనలు చేశారు. గత ప్రభుత్వంలో దేవాదుల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్వ వరంగల్ జిల్లాకు వినియోగించాలనే ప్రతిపాదనను పరిశీలించాలని, 300 రోజులపాటు నిరంతరాయంగా నీటిని ఎత్తిపోసేందుకు జీవో ఇవ్వాలని ఆయన కోరారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. రూ.330 కోట్లతో చేపట్టిన రామప్ప- పాకాల లిఫ్టు ద్వారా 36వేల ఎకరాల ఆయకట్టు సిరీకరించాల్సి ఉందని, కానీ పనుల జాప్యం కారణం గా లక్ష్యం నెరవేరలేదని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మిగిలిన 40శాతం పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. రామప్ప-గణపసముద్రం గ్రావిటీ కాల్వ ద్వారా నీటిని డీబీఎం 38కి మళ్లిస్తే నాలుగు మండలాల్లో కలిపి 44,700 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మిగతా 7వ పేజీలో..

హెల్త్‌సిటీపై విజిలెన్స్

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై విచారణ షురూ
- నిధుల కేటాయింపు, స్థలం మార్టిగేజ్‌పై ప్రభుత్వం సీరియస్
- రూ.1,100కోట్ల నుంచి రూ.1,725.95కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- జైలు స్థలం తాకట్టు పెట్టి రూ.1,173కోట్ల రుణం తీసుకున్న గత సర్కారు
- ఆస్పత్రి నిర్మాణం పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని అనుమానాలు
- జూన్ 29న వరంగల్ పర్యటనలో విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్
- వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ హెల్త్ సిటీపై విజిలెన్స్ విచారణ షురూ అయ్యింది. నగరం నడిబొడ్డున 24 అంతస్థుల్లో గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రినిర్మాణాన్ని చేపట్టింది. అయితే ఆస్పత్రినిర్మాణానికి వరంగల్ సెంట్రల్ జైలు స్థలాన్ని మార్టిగేజ్ (తాకట్టు) చేసి బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర నుంచి రూ.1,173కోట్ల రుణాన్ని తీసుకోవటం వివాదంగా మారుతోంది. అలాగే రూ.1,100కోట్లతో నిర్మాణ అంచనా వేసి.. ఏడాదిలోనే ఆ అంచనా వ్యయాన్ని రూ.1,726కోట్లకు పెంచటం కూడా నిబంధనలకు విరుద్ధమనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వరంగల్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిపేరుతో గత ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి జూన్ 29న వరంగల్‌లో పర్యటించిన సమయంలో ఆస్పత్రి నిర్మాణం, రుణాలు, అనుమతులపై విచారణకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు వరంగల్ హెల్త్‌సిటీ నిర్మాణంపై కూపీ లాగుతుండటం చర్చనీయాంశంగా మారింది.


విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

హెల్త్‌సిటీగా అభివృద్ధికి అడుగులు

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో కూడా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం వరంగల్ హెల్త్‌సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాడు రూ.1,100కోట్ల అంచనా వ్యయంతో 24 అంతస్థుల్లో భారీ ఆస్పత్రి నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ 2021 జూన్ 21వ తేదీన భూమి పూజ చేశారు. వరంగల్- హనుమకొండ నగరాల ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ జైలు స్థలంలో

మిగతా 7వ పేజీలో..



భద్రకాళికి ప్రత్యేక పూజలు

- శ్రావణ చివరి శుక్రవారం వేళ భక్తులతో కిటకిట

వరంగల్ కల్చరల్, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో భద్రకాళి అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నిత్య పూజ, అర్చన, అలంకరణలు అర్చకులు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా అమ్మ వారిని దర్శించుకున్నారు. చివరి శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఒడిబి య్యాలు పోసి వస్త్రాలను సమర్పించారు. యాగశాల వద్ద మహిళలు పసుపు, కుంకుమలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.


అమ్మవారి ఆలయంలో వాయినాలు ఇస్తున్న భక్తులు

పార్కింగ్‌తో ఇబ్బంది..

నిత్యం రద్దీతో ఉండే భద్రకాళి దేవాలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ భక్తులకు ఇబ్బందిగా మారింది. మంగళవారం, శుక్రవారం, ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వాహనాలు ఏర్పాటు చేసుకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం కార్లతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సమస్యగామారింది.

అన్నదానానికి భక్తుల పరిమితి పెంచాలి..

ఆలయంలో నిత్య అన్నదానం పరిమితి పెంచాలని భక్తులు కోరుతున్నారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 12 గంటలకు వంద మందికి భోజనం ఏర్పాటు చేస్తుండగా, శుక్ర, ఆదివారాల్లో 200మందికి ఏర్పాటు చేస్తున్నారు. ఆయా రోజుల్లో దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దర్శనానికి తరలి వస్తుండగా కేవలం 200 మందికి ఏర్పాటు చేయడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్ర, ఆదివారాల్లో కనీసం 500మందికి అన్నదానం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రచ్చకెక్కుతున్న కేయూ భూ వివాదం

- పోలీసులు, అధికారుల మధ్య లొల్లి
- గతంలో సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు వర్సిటీ నుంచి ఇచ్చిన భూమి
- క్యాంపు తరలించడంతో మళ్లీ తెరపైకి స్థల పంచాయితీ
- రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

కేయూ క్యాంపస్, ఆగస్టు 30: కాకతీయ యూనివర్సిటీలో భూమి గొడవ రచ్చకెక్కింది. 1980ప్రాంతంలో అప్పటి కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి, రాష్ట్ర పోలీసు యంత్రాంగం, జిల్లా పోలీసు అధికారుల విజ్ఞప్తి మేరకు 2 ఎకరాల భూమిని కేయూ పోలీస్ స్టేషన్, సీఆర్‌పీఎఫ్ పోలీస్ బెటాలియన్‌కు కేటాయించారు. అయితే ఇటీవల కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని భీమారం ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీఆర్‌పీఎఫ్ క్యాంపును తెలంగాణ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలించారు. ఇదే క్రమంలో గతంలో కాకతీయ యూనివర్సిటీకి కేటాయించిన భూమి మళ్లీ వర్సిటీకి దక్కాలని వర్సిటీ ఉన్నతాధికారులు, విద్యార్థులు, మేధావివర్గం ముందుకు వచ్చి పోరాటానికి దిగింది. ఈ నేపథ్యంలో ఎంతో కాలంగా తమ ఆధీనంలో ఉన్న భూమి తమకే దక్కాలని పోలీసు ఉన్నతాధికారులు భీష్మించుకుని కూర్చున్నారు. పోలీసులు, వర్సిటీ విద్యార్థులు, మేధావివర్గాలు.. భూమి తమదంటే తమదని మూడు రోజులుగా పోరాటాలకు దిగాయి.


వివాదాస్పదంగా మరిన వర్సిటీలోని సీఆర్‌పీఎఫ్ భూమి ఇదే..

వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ బోర్డు పీకివేత

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ క్యాంపు స్థలంలో వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలను అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవరెడ్డి నేతృత్వంలో రెండు బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు రెండు రోజుల పాటు కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు వ్యాయామం, ఇతర ప్రాక్టీసులు ఏర్పాటు చేశారు. అలాగే వివాదాస్పదంగా మారిన తాజా భూమికి వర్సిటీ ఉద్యోగిని కాపాలాగా ఉంచారు. అయినప్పటికీ వర్సిటీ అధికారుల కండ్లు కప్పి బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు పీకేశారు. అయితే, తాజాగా శుక్రవారం మళ్లీ వర్సిటీ ఉన్నతాధికారులు వివాస్పద భూమిలోకి వెళ్లి పరిశీలించారు. అప్పటికే అక్కడ 20 మంది పోలీసు సిబ్బంది, ఓ ట్రాఫిక్ ఎస్సైతో పాటు మరికొందరు అధికారులు చేరుకుని వర్సిటీ అధికారులతో భూమి తమదే అంటూ వాగ్వానికి దిగారు. చివరికి చేసేదేమీలేక వర్సిటీ ఉన్నతాధికారులు ఇన్‌చార్జి వీసీ, ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను రాష్ట్రస్థాయిలో పరిష్కరిస్తామని, అప్పటి వరకు పోలీసులు, వర్సిటీ ఉన్నతాధికారులు సంయమనంతో ఉండాలని సూచనలు వచ్చినట్లు తెలుస్తోంది.

పోలీసుల తీరుపై విద్యార్థుల ఆగ్రహం

పోలీసుల అవసరాల కోసం తాత్కాలికంగా ఇచ్చిన భూమిని ఇప్పుడు తమదే అని పోలీసులు జులుం చేయడం సరికాదని విద్యార్థులు అంటున్నారు. విద్యార్థులను, వర్సిటీ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి వర్సిటీకే దక్కాలని, లేకపోతే ఎంతకైనా ముందుకు సాగుతామని హెచ్చరిస్తున్నారు.

రుణమాఫీని వినియోగించుకోవాలి: కలెక్టర్

శంభునిపేట, ఆగస్టు 30 : రైతులు ప్రభుత్వం అందించిన రుణ మాఫీని వినియోగించుకొని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. రైతురుణ మాఫీ వివరాలు తనిఖీ చేసేందుకు శుక్రవారం ఖిలావరంగల్ మండలం మామునూరులోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు బ్రాంచిని సందర్శించారు. ఎంతమందికి రుణమాఫీ వర్తించింది, ఎంత మందికి రెన్యువల్ చేశారు, ఇంకా ఎంత మంది రైతులకు రెన్యూవల్ చేయాల్సి ఉందో పరిశీలించారు. ఆధార్ కార్డులో తప్పులు ఉండటం వలన రుణమాఫీ కాని రైతులతో పాటు రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డులో సవరణలు, పట్టాదారు పాసు పుస్తకం నెంబర్‌లు తప్పు పడటం, పూర్తి పేరు కలువకపోవటం లాంటి సమస్యలు ఉన్నట్లైతే బ్యాంకు మేనేజర్ సరిచేస్తారని రైతులకు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారిణి అనురాధ, కో ఆపరేటివ్ అధికారి ఎం. సంగీత, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హెచ్ రాజు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నరసింగం, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.


మామునూరులోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రైతు ఖాతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 30: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న నిర్వహించే గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ కోరారు. శుక్రవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ... గురుపూజోత్సవం నాడు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని, అందుకోసం ఏడు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ కమిటీ వారికి అప్పగించిన పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాన్ని ఉర్సుగుట్ట వద్దనున్న ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు సుజన్‌తేజ, ఫ్లోరెన్స్, సుభాష్, డీఎస్‌వో డాక్టర్ శ్రీనివాస్, డీసీఈబీ సెక్రెటరీ కృష్ణమూర్తి, ఏసీజీఈ నర్సింహారావు, ఎంఈవో విజయ్‌కుమార్, హెడ్మాస్టర్లు అశోక్‌కుమార్, లక్ష్మయ్య, పూసారాంనాయక్, శ్రీధర్, రామకృష్ణారెడ్డి, ఎస్‌వో హిమబిందు, ఏఎస్‌సీ వేణుగోపాల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

వరంగల్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంపత్‌కుమార్

హనుమకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తోట సంపత్‌కుమార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆయన ఎన్నిక కావడం వరుసగా ఇది ఐదోసారి. అసోసియేషన్‌కు అధ్యక్షడి బాధ్యతలు నిర్వర్తించడం ఆరోసారి. వరంగల్ హంటర్ రోడ్డు లోని అసోసియేషన్ ప్రాంగణంలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాత్రి అసోసియేషన్ నూతన పాలకవర్గానికి ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడిగా సంపత్‌కుమార్, కోశాధికారిగా తక్కళ్లపల్లి యుగేందర్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ జరిగింది. ఈ పదవికి భండారు దామోదర్‌తోపాటు ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోనెల రవీందర్



ఎన్నికైన నూతన పాలక వర్గం

తిరిగి పోటీలో నిలబడ్డారు.

వరంగల్ జిల్లాలో మొత్తం 165 రైస్‌మిల్లులు ఉండగా, 148 మంది సభ్యులుగా ఉన్నారు. వీరిలో 140మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. దామోదర్‌కు 72 ఓట్లు రాగా, రవీందర్‌కు 68 వచ్చాయి. దామోదర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కొత్త పాలకవర్గం కాలపరిమితి రెండేళ్లు. కొత్త పాలకవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తనను తిరిగి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

మార్కెట్‌కు కొత్త పత్తి.. క్వింటా రూ.7,011..

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 30: వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ కు శుక్రవారం కొత్త పత్తి అమ్మకానికి వచ్చింది. సాధారణంగా సెప్టెంబరు నెలాఖరు వరకు కొత్త పత్తి మార్కెట్‌కు వస్తుంది. అలాంటిది నెల ముందే అమ్మకానికి రావడంతో వ్యాపారులు, కార్మికులు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా ఐనవో లు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పిండి రవి ఎనిమిది బస్తాల కొత్త పత్తిని అమ్మకానికి తీసుకురాగా, డీకే అడ్తి ద్వారా గోకుల్ కాటన్ ఇండస్ట్రీస్ నిర్వాహ కులు క్వింటాల్‌కు రూ.7,011 చొప్పున కొనుగోలు చేశారు.

పెరిగిన కొత్త మక్కల ధర

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో కొత్త మక్కల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శుక్రవారం క్వింటా రూ.2,960 పలికింది. సంగెం మండలం మొండ్రాయికి చెందిన ఎర్రె ప్రతాప్ 10 బస్తాల కొత్త మక్కలు అమ్మకానికి తేగా లక్ష్మి ట్రేడర్స్ ద్వారా శ్రీజయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటా రూ. 2,960 చొప్పున కొనుగోలు చేశారు.



మక్కలను తీసుకువచ్చిన రైతు



ఆర్టీసీ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎం డి.విజయభాను

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు

బాలసముద్రం, ఆగస్టు 30: వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో విధుల్లో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేసినట్లు ఆర్ఎం. డి.విజయభాను తెలిపారు. శుక్రవారం వరంగల్-1డిపోలో ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు పంపిణీ చేసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఆర్ఎం. విజయభాను మాట్లాడుతూ.. రాఖీ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు సమన్వయంతో పని చేయడంతో సిబ్బందిని అభినందించారు. శ్రావణమాసంలో కూడా వరంగల్ రీజియన్ అగ్రగామిగా నిలవాలని కోరారు. అవార్డులతో పాటు క్యాష్ ప్రైజ్, ప్రశంసాపత్రాలు అందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ఓ. కేశవరాజు భానుకిరణ్, ఎం. మాధవరావు, బాపురావు, రవీందర్, 9 డిపోల డిపో మేనేజర్లు సూపర్‌వైజర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలివెళ్లిన మోర్చాల బాధ్యులు



హాజరైన వివిధ మోర్చాల బాధ్యులు

హనుమకొండ టౌన్, ఆగస్టు 30: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నాగోల్‌లో జరిగిన వివిధ మోర్చాలు, విభాగాల సంయుక్త కార్యశాలకు హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆదేశాల మేరకు జిల్లా నుంచి వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ హాజరై వచ్చే నెల 2నుంచి జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని పెంచాలని సూచించినట్లు తెలిపారు. సంయుక్త కార్యశాలకు జిల్లా నుంచి హాజరైన వారిలో బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గండు సారయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణచారి, ప్రధానకార్యదర్శి పిట్టల రమేశ్, ఉపాధ్యక్షుడు బాణాల రమేశ్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీరత్న, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.


కేయూ లా కళాశాలకు వెబ్ అప్షన్‌కు గడువు

కేయూ క్యాంపస్, ఆగస్టు30: కాకతీయ యూనివర్సిటీలో అనుబంధ న్యాయకళాశాల అడ్మిషన్లు కోసం వెబ్ అప్షన్ ఇచ్చుకునే గడువు ఆగస్టు 30తో ముగిసింది. ఏటా అక్టోబరు, సెప్టెంబరులో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టే కౌన్సెలింగ్.. ఈ ఏడాది న్యూఢిల్లీలోని బార్‌కౌన్సిల్‌తో నిర్ణయంతో ఆగస్టులోనే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. టీసీఐ, రాష్ట్రలాసెట్ అడ్మిషన్లు ఉన్నతాధికారులు కాకతీయ యూనివర్సిటీలో లా అడ్మిషన్లు పొందేందుకు మొదట రెండు రోజులపాటు వెబ్‌అప్షన్‌లకు అవకాశం కల్పించినప్పటికీ ఇతర రాష్ట్ర అధికారుల నిర్ణయంతో ఒక్కరోజుతోనే ముగించారు. అయితే మొదటి దఫా కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ అనుబంధ లా కళాశాలలో వెబ్ అప్షన్ ఇచ్చుకునే వీలుకాని ఆశావహులకు మరోదఫా ప్రకటించే నోటిఫికేషన్‌లో అప్షన్ ఇచ్చుకునే వీలుంది. మొదటి దఫా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సంబంధిత కళాశాలలోనే సర్టిఫికెట్లు ధ్రువీకరించుకుని అడ్మిషన్లు పొందాలి. ఇదిలాఉండగా న్యాయ శాస్త్ర కోర్సులు పూర్తిచేసి ఎల్ఎల్ఎం కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు సెప్టెంబరు వరకు 17 గడువును పొడిగించారు.

పేదల రైళ్లపై పట్టింపేదీ?

పునరుద్ధరణకు నోచుకోని పుష్‌పుల్, మణుగూరు రైళ్లు ● రైల్వేశాఖ తీరుపై వరంగల్, ఖమ్మం, నల్లగొండ సామాన్యుల ఆగ్రహం

గిర్మాజీపేట, ఆగస్టు 30: కరోనా మహమ్మారిని మరిచిపోయి జనజీవనం సాధారణ స్థితికి చేరి మూడేళ్లు గడుస్తున్నా పేదల రైళ్లపై కేంద్రం కనికరం చూపడంలేదు. కరోనా లాక్‌డౌన్ పోయినా పేదల రైళ్లకు కేంద్రం లాక్ తీయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల గ్రామీణ పేదల జీవితాలతో మమేకమైన హైదరాబాద్ పుష్‌పుల్, మణుగూరు రైళ్ల పునరుద్ధరణకు ప్రజా ప్రతినిధులు నోరెత్తకపోవడం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.



వరంగల్ - హైదరాబాద్ పుష్‌పుల్

కరోనాకు ముందు వరంగల్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం, మధ్యాహ్నం పుష్‌పుల్ రైలు నడిచేది. ప్రతీ రోజు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో హైదరాబాద్ వెళ్లేందుకు సామాన్యులకు అందుబాటులో అనుగుణంగా ఉండేది. హైదరాబాద్‌కు టికెట్ చార్జి రూ.30 మాత్రమే ఉండడంతో ఎప్పుడూ రైలు ప్రయాణికులతో కిక్కిరిసేది. ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం పుష్‌పుల్ రైలు చాలా ఉపయోగపడేది. కరోనా లాక్‌డౌన్‌లో 2021లో రైల్వేశాఖ పుష్‌పుల్‌ను నిలిపివేసింది. పుష్‌పుల్ రైలు లేక పేద ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందించిన రైల్వేశాఖ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు మధ్యాహ్నం ట్రిప్పును మాత్రమే 2022 జూలై 25న పునరుద్ధరించి, కొద్దికాలం నడిపి మళ్లీ నిలిపివేసింది. అయితే కాజీపేట నుంచి ఉదయం వేళ మాత్రమే పుష్‌పుల్ రైలు హైదరాబాద్‌కు నడుస్తున్నా ప్రజలకు ఆశించిన మేరకు లబ్ధిచేకూరటం లేదు. కాజీపేట- హైదరాబాద్ మార్గంలో పుష్‌పుల్ రైలు మాత్రమే ప్రతి చిన్న స్టేషన్‌లో ఆగుతూ ప్రయాణికులకు రైల్వే సేవలు అందిస్తోంది. వరంగల్- హైదరాబాద్ మధ్య నడుస్తున్న రైళ్లన్నీ ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు కావడంతో ఈ మార్గంలోని చిన్న స్టేషన్‌లో ఈ రైళ్లు ఆగని కారణంగా వీరికి ఏకైక దిక్కు అయిన పుష్‌పుల్ రైలు మధ్యాహ్నం వేళ నడవకపోవడంతో గ్రామీణ స్టేషన్‌ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాజీపేట- మణుగూరు ప్యాసింజర్

కాజీపేట నుంచి వరంగల్ మీదుగా మణుగూరుకు నడిచే మణుగూరు ప్యాసింజర్ రైలు కాజీపేట- మణుగూరు మార్గంలోని అన్ని రైల్వేస్టేషన్ ప్రాంతాల ప్రజలకు చాలా అందుబాటులో ఉండేది. మధ్యాహ్నం 11.30 గంటల వరంగల్ మీదుగా మణుగూరు వెళ్లిన ఈ రైలు తిరిగి రాత్రి 10 గంటలకు వరంగల్‌కు వచ్చేది. వరంగల్ - మణుగూరు రైల్వే మార్గంలోని చిన్న స్టేషన్‌ల అన్ని వర్గాల ప్రజలు తమ అవసరాల రీత్యా వరంగల్ మహనగరానికి వచ్చి పనులు చూసుకుని తిరిగి సాయంత్రం తమ ఇంటికి చేరుకునేందుకు ఈ రైలు చాలా అనువుగా ఉండేది. తక్కువ చార్జీ కావడంతో నిత్యం ఈ రైలు ప్రయాణికులతో రద్దీగా ఉండేది. కరోనా లాక్‌డౌన్‌లో నిలిపివేసిన ఈ రైలును పునరుద్ధరించకపోవడంతో నాలుగేళ్ల నుంచి ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఆగ్రహం

నాలుగేళ్ల నుంచి వరంగల్-హైదరాబాద్ పుష్‌పుల్, కాజీపేట-మణుగూరు ప్యాసింజర్ రైళ్లను నడపకపోవడం.. అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉమ్మడి జిల్లాల ఎంపీలు, రైల్వేశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వరంగల్-హైదరాబాద్ పుష్‌పుల్ రైలు కేవలం మధ్యాహ్నం ట్రిప్పును 2022 జూలై 25న పునరుద్ధరించినపుడు అప్పటి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, శాసనసభ రైల్వే జడ్ఆర్‌యుసిసి సభ్యులు నన్నపునేని నరేందర్, వరంగల్ బీజేఈ నాయకులు పోటాపోటీగా హంగామా చేశారే తప్ప కొద్దికాలం నడిచిన పుష్‌పుల్ రైలు రద్దు అయితే మాట్లాడకపోవడంపై నాయకుల తీరును విమర్శలు వినిపిస్తున్నాయి. వరంగల్ రైల్వేస్టేషన్‌ను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న రైల్వేశాఖ డిమాండ్ ఉన్న వరంగల్ హైదరాబాద్ పుష్‌పుల్, మణుగూరు ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

పుష్‌పుల్‌ను పునరుద్ధరించాలి

మైదం సునీత వెంకన్న, హంటర్ రోడ్డు



పుష్‌పుల్ రైలును పునరుద్ధరించాలి. వైద్య అవసరాలు, పిల్లలను చూసేందుకు హైదరాబాద్ పోయేందుకు ఈ రైలు సామాన్యులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. వరంగల్ నుంచి హైదరాబాద్ పోయి వచ్చేందుకు ఒక్కోక్కరికి రానుపోను చార్జీలు కేవలం రూ.60 మాత్రమే అయ్యేది.

'మణుగూరు'ను మళ్లీ నడపాలి..

కొట్టె మురళి, రైతు, అలంఖానిపేట



నెక్కొండ నుంచి వరంగల్‌కు వైద్యం, మార్కెట్ తదితర అవసరాల కోసం నిత్యం పలువురు రాకపోకలు సాగించేందుకు మణుగూరు ప్యాసింజర్ రైలు గ్రామీణ ప్రజలకు అనువుగా ఉండేది. కరోనా నుంచి ఈ రైలును రద్దు చేయడంతో ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా మణుగూరు ప్యాసింజర్ తిరిగి నడపాలి. పేద గ్రామీణ ప్రజలకు రైలు సదుపాయం అందించాలి.

ప్రతీ ఎకరాకు గోదావరి నీరు

(5వ పేజీ తరువాయి)

అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 800ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని, రూ.40 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దేవాదుల ద్వారా 7700 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడుతుందని అన్నారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని కోనారెడ్డి చెరువు ఆయకట్టులోని కాల్వల్లో పూటికతీత కోసం రైతుల కష్టాన్ని చూడలేక తన సొంత డబ్బులు రూ.2 లక్షలను ఖర్చు చేసి పనులు చేయించినట్లు ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు తెలిపారు. శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. దేవాదుల నీటి వినియోగంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. 2009లోనే దేవాదుల రెండో ఫేస్‌ను ఎస్సారెస్పీకి అనుసంధానించడం ద్వారా సాగునీటిని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. చిన్నచిన్న మరమ్మతులు చేయలేక వేల ఎకరాలకు నీరందించలేని పరిస్థితి ఉందని తెలిపారు.

ఈ పర్యటన, సమావేశంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, సీఈ, ఎస్ఈలు, ఇంజనీరింగ్ అధికారులు, పాల్గొన్నారు. ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ బి.గీతే, ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెరువులో పడి ఇంటర్ విద్యార్థిని మృతి



లిఖిత (ఫైల్)

బాలసముద్రం, ఆగస్టు 30: పాలిటెక్నిక్ చదువుతున్న ఓ విద్యార్థిని వడ్డెపల్లి చెరువులో పడి మృతి చెందిన ఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన రామలిఖిత (16) పాలిటెక్నిల్ ఫస్టియర్ చదువుతోంది. గురువారం ఇంటినుంచి మడికొండలోని పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లింది. సాయంత్రం లిఖిత ఇంటికి తిరిగి రాకపోవడంతో లిఖిత తల్లి రామ చిత్ర లిఖిత స్నేహితులకు ఫోన్ చేసి తెలుసుకోగా హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు వద్ద బస్సు దిగినట్లు చెప్పడంతో అప్పటి నుంచి చెరువు వద్ద వెతకడంతో చెరువులో లిఖిత మృతదేహం లభించినట్లు తెలిపారు. మృతురా లి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలు తెలుసుకుంటుంన్నట్లు సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్, రామారావు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



మృతి చెందిన సాయిరోహిత్

బాలసముద్రం, ఆగస్టు 30: చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన ఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సుబేదారి పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండకు చెందిన సాయిరోహిత్ (17) హనుమకొండ బాలసముద్రం లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో మడికొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సుబేదారి ఫారెస్టు కార్యాలయం సమీపంలో బస్సు ఫుట్‌బోర్డుపై ఉన్న సాయిరోహిత్ కిందపడిపోవడంతో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వెంటనే స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి కాలేశ్వరపు సురేఖ ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 30: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ప్రవేశాల గడువును సెప్టెంబర్ 7 వరకు పొడిగించినట్లు డీఐఈవో ఎ.గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశమని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఇప్పటి వరకు ప్రవేశాలు పొందని విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు అనుమతులున్న కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు.

హెల్త్‌సిటీపై విజి'లెన్స్'

(5వ పేజీ తరువాయి)

56ఎకరాల్లో ఈ అస్పత్రి నిర్మాణం చేపట్టారు. ఇక అస్పత్రి కోసం రూ.1,100కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం 2021 డిసెంబరు 4వ తేదీన జీవో నెం.158ని విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం సివిల్ పనులకు రూ.509కోట్లు, తాగునీరు, పారిశుద్య నిర్వహణ కోసం రూ.20.36కోట్లు, మెకానికల్, ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్ పనుల కోసం రూ.182.18కోట్లు, వైద్య పరికరాల కోసం రూ.105కోట్లు, అనుబంధ పనుల కోసం రూ.54.28కోట్లు, పన్నులు, ఇతర పనుల కోసం రూ.229.18కోట్లు కేటాయించారు. ఇక అస్పత్రి నిర్మాణాన్ని టెండర్ల ప్రక్రియ ద్వారా ఎల్ అండ్‌టీ కంపెనీకి అప్పగించి, ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో పనులు పూర్తి చేసేలా గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిలో 34 విభాగాల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే 56ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రితో పాటు ఎంజీఎం అస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్నిటిని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో అన్ని రకాల వైద్య సేవలతో పాటు మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు ఒకే గొడుకు కిందికి వస్తుండటంతో సుమారు 215 ఎకరాల్లో వరంగల్ హెల్త్‌సిటీగా అభివృద్ధి కావాల్సి ఉంది.

అనుహ్యంగా రూ.1,726కోట్లకు పెరిగిన వ్యయం

2021 డిసెంబరు 4న జీవో 158 ద్వారా వరంగల్ హెల్త్‌సిటీకి ప్రభుత్వం రూ.1,100కోట్లు కేటాయించింది. సివిల్ వర్క్స్, మెకానికల్, ఎలక్ట్రిసిటీ, తాగునీరు, పారిశుద్య నిర్వహణ, ప్లంబింగ్, అస్పత్రికి అవసరమైన యంత్రాలు, పరికరాలు తదితర అన్నింటికి కలిపే మొత్తం రూ.1,100కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. 2022 జనవరిలోనే పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఏడాదిన్నర కాలంలోనే రెండు పర్యాయాలు రహస్యంగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి అంచనా వ్యయాలను గత ప్రభుత్వం పెంచింది. రూ. 1,100 కోట్ల నుంచి ఏకంగా రూ.1,725.95కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచింది. ఇందులో ఎక్విప్‌మెంట్‌కు రూ.100 కోట్లు, సెరామిక్ టైల్స్ రూ.100కోట్లు, ఎలక్ట్రిసిటీకి రూ.80 కోట్లతో పాటు భారీగా బడ్జెట్‌ను గత ప్రభుత్వం పెంచినట్లుగా సమాచారం. అయితే అస్పత్రి నిర్మాణాన్ని ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిన చేపట్టడంతో అంచనా వ్యయాన్ని పెంచేందుకు వీలు లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రూ.1,100కోట్ల నుంచి రూ.1,725.95 కోట్లకు అంటే రూ.625.95కోట్ల నిధులను పెంచారు. అనూహ్యంగా అంచనా వ్యయం భారీగా పెరగడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. గత మే నెలలో వరంగల్ హెల్త్‌సిటీపై హైదరాబాద్‌లో సమీక్షలో, జూన్ 29న వరంగల్ పర్యటనలో నిర్వహించిన సమీక్షలో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రి భవనాలను 24 అంతస్తుల్లో నిర్మించటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ నిబంధనల ప్రకారం ఏకంగా రూ.625.95కోట్లు పెంచారని, దీనిపై విచారణకు ఆదేశిస్తున్నట్లుగా సీఎం వరంగల్‌లోనే ప్రకటించారు.

జైలు భూమిని తాకట్టు పెట్టి అస్పత్రికి అప్పు..

గత ప్రభుత్వం వరంగల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రికి అప్పు తీసుకరావటం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జైలును కూల్చేసి అస్పత్రి నిర్మాణానికి గత ప్రభుత్వం అడుగులు వేసింది. ఈ క్రమంలో అస్పత్రి నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు లేకపోవడంతో తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్) ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759గజాల స్థలాన్ని (56ఎకరాలు)బదిలీ చేస్తూ జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయమై కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి కోసం రుణం తీసుకోవటంపై ఆగ్రహంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు.

విజిలెన్స్ విచారణ షురూ...

వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణ వ్యయం భారీగా పెంచటంపై సీరియస్‌గా ఉన్న ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు వరంగల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి బాలకోటి వరంగల్ సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని సందర్శించారు. కాంట్రాక్టు కంపెనీ ఎల్‌అండ్‌టీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన అస్పత్రి నిర్మాణ రికార్డులను పరిశీలించి.. కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకొని, ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులపై ఎంత వరకు ఖర్చు చేశారు? ఇంకా ఎంత ఖర్చు చేయాల్సి ఉంది, పనులు ఏ మేరకు జరిగాయి? తొలుత ఆమోదించిన డిజైన్ల ఏంటి? కొత్తగా ఏమైనా డిజైన్లలో మార్పు చేశారా..? పాత డిజైన్ ప్రకారమే పనులు జరుగుతున్నాయా లేదా? తదితర వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుది నివేదిక వారం పదిరోజుల్లో ప్రభుత్వానికి సమర్పించనున్నారు. అలాగే జైలు స్థలాన్ని తాకట్టు పెట్టడంపై గత మార్చి నెలలోనే విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ తాకట్టు పెట్టిన స్థలం ద్వారా ఎంత రుణం తీసుకున్నారు? తీసుకున్న రుణంలో ఇప్పటి వరకు ఎన్ని కిస్తీల్లో ఎంత చెల్లించారు? బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో గత ప్రభుత్వం రుణం కోసం చేసుకున్న ఒప్పందమేంటనే కోణంలో విచారణ చేపట్టింది. మొత్తానికి వరంగల్ జైలును కూల్చివేసి.. హైదరాబాద్‌కు దీటుగా సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని నిర్మిస్తున్నామని గత ప్రభుత్వం చెప్పినా.. జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి అప్పు చేయటం, రహస్యంగా రూ.623కోట్ల వరకు అంచనా వ్యయాన్ని పెంచటం వెనుక ఏం జరిగిందనే చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఇచ్చే నివేదికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2960	2700
పల్లికాయ (సూక)	5800	5400
పల్లికాయ (పచ్చిది)	3850	3000
కందులు	8852	8552
పెసళ్లు	7002	5552
పత్తి	7500	5000
పసుపు (కాడి)	12009	10000
పసుపు (గోల)	11555	11409
తేజ మిర్చి	12000	8000
తేజ ఏసీ	17500	15000
వండర్‌హాట్ ఏసీ	14000	13000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

-వరంగల్ వ్యవసాయం









గుళ్లకు పాలక మండళ్లు

- నియామకానికి దేవాదాయ శాఖ కసరత్తు
- తొలుత రూ.కోటి ఆదాయమున్న వాటికే..
- ఉమ్మడి జిల్లాలో 8 ఆలయాలకు బోర్డులు
- సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం
- నోటిఫికేషన్లు జారీ చేయనున్న ఈవోలు
- ఎమ్మెల్యేల వద్దకు ఆశావహుల పరుగులు

హనుమకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆలయాలకు త్వరలో పాలకమండళ్ల (ట్రస్ట్ బోర్డులు) నియామకం జరగనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తొలుత రూ.కోటిపైగా ఆదాయమున్న రాష్ట్రంలోని 26దేవాలయాలకు ట్రస్టు బోర్డుల నియామకానికి దేవాదాయ శాఖ పూనుకున్నది. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో నోటిఫికేషన్లు

ఆలయ ట్రస్ట్‌బోర్డుల నియామకానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లకు ఉత్తర్వులు జారీచేయడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆలయ ధర్మకర్త మండళ్ల నియామకానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. ధర్మకర్త మండళ్ల నియామకానికి ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని ఈ 8 ఆలయాల ఈవోలకు ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత ఆదేశాలు జారీ చేశారు. ధర్మకర్తల మండళ్ల నియామకానికి సభ్యులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్లు జారీ చేయవలసిందిగా కోరారు. ఈవోలు నోటిఫికేషన్లు జారీ చేసిన 20రోజులలోగా ట్రస్ట్‌బోర్డులో సభ్యులుకాగోరువారు తమ దరఖాస్తులను దేవాదాయ శాఖ కమిషనర్‌కు గానీ, లేదా డిప్యూటీ కమిషనర్‌కుగానీ సమర్పించాలి. దేవాదాయ శాఖ వీటిని పరిశీలించి అర్హులైనవారిని సభ్యులుగా ఎంపిక చేస్తుంది.



పదేళ్లుగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఆలయాలకు చాలా ఏళ్లుగా ట్రస్ట్ బోర్డులు లేవు. హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన భద్రకాళి దేవాలయానికి పదేళ్లుగా ధర్మకర్త మండలి లేదు. ట్రస్ట్‌బోర్డు నియామకానికి సంబంధించి అనువంశిక వివాదం కోర్టులో ఉంది. ఇటీవలే పరిష్కారమైంది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆలయ అనువంశికులే ఉండాలంటూ కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆలయ అనువంశిక పూజారి భద్రకాళి శేషు చైర్మన్‌గా నియమితులు కావలసి ఉండగా, దేవాదాయ చట్టంలో ఇటీవల చేసిన మార్పుల మేరకు అనుశంశికుల్లో ఒకరైన భద్రకాళి శేషు సోదరుడు డాక్టర్ శివసుబ్రమణ్యం నియమతులైనట్టు సమాచారం. అనువంశిక వివాదం కొనసాగిన దేవాలయాల్లో కొడవటంచ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం కూడా ఉంది.

పడకేసిన పాలన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన దేవాలయాల పాలక మండళ్ల పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా పునర్నియామకాలు లేకపోవడంతో వాటి పాలన పడకేంది. కొన్ని దేవాలయాల్లో రెన్యూవేషన్ కమిటీలు వేశారు. శివరాత్రి పర్వదినం, జాతర ఏర్పాట్ల కోసం మడికొండలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయం, సమక్క - సారలమ్మ జాతరకు రెన్యూవేషన్ కమిటీలనే వేసి పనులు కానిచ్చారు. అయితే వీటికి ప్రభుత్వం నిధులు నమకూర్చేందుకు, ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేసేంత అధికారం ఉండదు. పాలక మండళ్ల ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రకటనలు వెలువరించింది. పదవీకాలం పూర్తయిన కొన్ని దేవాలయాల పూర్తి వివరాలను ఇది వరకే దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావలసి ఉండగా, ఇంతలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఆలయాల పాలక మండళ్ల నియామకానికి వెంటనే పూనుకోలేదు. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఈఅంశాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ప్రభుత్వం ఇప్పుడు తాజాగా దీనిపై దృష్టి సారించింది. దీంతో దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మెల్యేల చేతిలో..

ట్రస్ట్‌బోర్డు చైర్మన్లు, సభ్యులవి పూర్తిగా నామినేటెడ్ పోస్టులు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ప్రతిపాదించినవారికే పాలకమండలిలో సభ్యులుగా అవకాశం దక్కటం పరిపాటి. దీంతో నామినేటెడ్ పదువులు ఆశిస్తున్నవారు ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా పెట్టుకున్న దరఖాస్తుల్లో ఆయా ఆలయాల పరిధిలోని ఎమ్మెల్యేలు సూచించినవారి పేర్లే ఖరారవుతాయి. పెద్ద దేవాలయాలకు ఒకరికిన్నా ఎక్కువమంది ఎమ్మెల్యేలు ట్రస్ట్‌బోర్డు సభ్యులను ఎంపిక చేయడంలో ఒత్తిళ్లు చేసే పరిస్థితులు ఉన్నాయి. భద్రకాళి దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం, సమ్మక్క - సారలమ్మ జాతర, కొడవటంచ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం వంటి పెద్ద దేవాలయాల ట్రస్ట్‌బోర్డుకు చైర్మన్‌గా, సభ్యులుగా ఉండడం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నందున వీటిలో తమ అనుచరులు సభ్యులుగా నియమితులయ్యేట్టు చూడడంలో ఎమ్మెల్యేలు ఎక్కువగా పోటీ పడే అవకాశం ఉంది. రూ.కోటికన్నా తక్కువ ఆదాయం ఉన్న ఆలయాలకు రెండో విడత ట్రస్ట్ బోర్డు నియామకాలు జరుగుతాయి. రూ.5లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాలకు ట్రస్ట్ బోర్డులు ఉండవు. ఆలయ నిర్వాహకులే దాతలో నియమించుకుంటారు.

ఈ ఆలయాలకే ట్రస్టు బోర్డు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.కోటి ఆదాయం కలిగిన 8 సుప్రసిద్ధ దేవాలయాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం (ఆదాయం రూ.4,29,14,599), ఇదే జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం (ఆదాయం రూ. 1,12,54,218), హనుమకొండ జిల్లాలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయం, ఇదే జిల్లా ఐనవోలు మండలంలోని మల్లికార్జున స్వామి ఆలయం (ఆదాయం రూ.4,31,97,905), కాజీపేట మండలం మడికొండలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం (ఆదాయం రూ.1,03,30,000). హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయం (ఆదాయం రూ. 1,90,52,001), మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి దేవాలయం (ఆదాయం రూ. 3,88,99,091), ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ జాతర ఆలయం (ఆదాయం రూ.10,54,53,447) వీటిలో ఉన్నాయి.

నియామకం

ట్రస్ట్‌బోర్డులో 14 మందికి తగ్గకుండా సభ్యులుంటారు. వీరిలో ఒకరు మహిళ, ఒకరు ఎస్సీ ఒకరు ఎస్టీ వర్గానికి ప్రాతినిథ్యం ఉంటుంది. వీరితోపాటు బీసీ, ఓసీలు సభ్యులుగా ఉంటారు. ఈ 14 మందిలో ఒకరు చైర్మన్‌గా నియమితులవుతారు. ట్రస్టు బోర్డులో సభ్యులు హిందువులై ఉండాలి. ఆధ్యాత్మిక చింతన, ధార్మిక భావన కలిగి ఉండాలి. ధర్మప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ఉండడం, ఆలయ నిర్మాణదాతలు, స్వచ్ఛంద సేవకులుగా ఉండడం అదనపు అర్హతలు. ట్రస్టు బోర్డు సభ్యులుగా నియామకం అయ్యేవారు నిర్దిష్టమైన ఫారమ్‌లో అన్ని వివరాలను పేర్కొనాలి. సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి.

నేడు మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ రాక

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 30: ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీని శనివారం రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి సందర్శించనున్నారు. అభివృద్ధి పనుల పరిశీలన, మార్కెట్ ఫీజు వసూలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. మార్కెట్ ఫీజు వసూలుకై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు, డీఎంవోలు, డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ పాల్గొననున్నారు.

ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నేడు

మట్టెవాడ, ఆగస్టు30: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో వరంగల్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ విగ్రహ తయారీదారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మట్టెవాడ సీఐ గోపీ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ములుగు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ హాజరవుతారన్నారు.



బల్దియా కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న 40వ డివిజన్ ప్రజలు

మౌలిక సదుపాయాలు కల్పించాలి

బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు30: గ్రేటర్ వరంగల్ 40వ డివిజన్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు డివిజన్‌లో అభివృద్ధి పనులకు కావలసిన ప్రత్యేక నిధులు కేటాయించాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేశారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చింతకుట్ల రాజేందర్‌రెడ్డికి 13 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. మేయర్, కమిషనర్ నిర్లక్ష్యం వల్లనే డివిజన్‌లో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని మండిపడ్డారు. అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ చూపించకపోవడం వల్లనే గ్రేటర్‌లోని చాలా డివిజన్‌లలో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని ఆరోపించారు. కార్యక్రమంలో విజయ్, శ్రీకాంత్, రాజన్‌బాబు, ఐలేశ్, నాగరాజు, హరిప్రసాద్, సుధాకర్, శ్రీనివాస్, రాజు, పుష్పలత, గౌతం పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన నాయకులు



కరీమాబాద్, ఆగస్టు 30: ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ప్రభుత్వ మద్య విమోచన కమిటీలను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తూ అక్రమ మద్యం అమ్మకాలు జరుపుతుండటంతో ఎందరో మద్యానికి బానిసలుగా మారు తున్నారని వివరించారు. స్పందించిన నరేందర్‌రెడ్డి జిల్లాల వారీగా కమిటీలను ప్రకటి స్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏపీ మాజీ ప్రభుత్వ మద్య విమోచన ప్రచార కమిటీ డైరెక్టర్ దాసి రాందేవ్, సింగిల్ విండో చైర్మన్ గంట దామోదర్ రెడ్డి ఉన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 30: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 26 మంది వాహనదారులకు శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 26 మంది వాహనదారులకు రూ.38,400లు జరిమానా విధించారు. ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

కునారిల్లుతున్న కూడళ్లు

- అభివృద్ధిలేని జంక్షన్లు
- పదేళ్లుగా ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు



ప్రమాదకరంగా ఇసుక అడ్డా జంక్షన్



వాహనాలు ఢీకొట్టడంతో కూలిన ఫోర్ట్‌రోడ్డు డివైడర్

ఖిలావరంగల్, ఆగస్టు 30: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది నగర దుస్థితి. అండర్ రైల్వేగేట్‌లోని జంక్షన్‌లతోపాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు లేక ప్రమాదకరంగా మారింది. ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. వరంగల్ చౌరస్తా, పోచమ్మమైదాన్, ఎంజీఎం, ములుగురోడ్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్, మిల్స్‌కాలనీ -చింతల్ ఫ్లైఓవర్, తెలంగాణ జంక్షన్, అండర్‌బ్రిడ్జి- ఇసుకఅడ్డా జంక్షన్, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు జంక్షన్, శంభునిపేట జంక్షన్, గవిచర్ల జంక్షన్, నాయుడు పెట్రోల్‌పంపు జంక్షన్‌లు ఇరుకుగా, ప్రమాదకరంగా మారాయి. పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ నగర పాలక సంస్థ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ (కుడా)ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని 10 జంక్షన్‌లు, డివైడర్‌లు, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేస్తామని అప్పటి పాలకులు హామీ ఇచ్చారు. కానీ సరిపడా నిధులను విడుదల చేయకపోవడంతో జంక్షన్‌లు అధ్వానంగా మారాయి.

ప్రమాదకరంగా జంక్షన్‌లు..

వరంగల్ ములుగురోడ్, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, ఎంజీఎం, మిల్స్‌కాలనీ, ఇసుకఅడ్డా, ఫోర్ట్‌రోడ్, శంభునిపేట, గవిచర్ల నాయుడు పెట్రోల్‌పంపు, బొల్లికుంట, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల జంక్షన్‌లు నిత్యం భారీ వాహనాల రాకపోకలతోపాటు రద్దీగా ఉంటుంది. ఆయా జంక్షన్లు అధ్వానంగా మారడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. పలు జంక్షన్లు డెంజర్‌గా మారాయి.

చీకటిపడితే అంధకారం..

చీకటి పడితే నగరంలోని పలు జంక్షన్లలో అంధకారం అలముకుంటోంది. సెంట్రల్ లైటింగ్, విద్యుత్ దీపాలు లేకపోవడంతో, కొన్నిచోట్ల లైట్లు వెలగలపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర, పాదచారులు చీకటిలో ప్రమాదాలబారిన పడుతున్నారు.



ఇరుకుగా శంభునిపేట జంక్షన్



మిల్స్‌కాలనీ -చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుంతలు

బ్రిడ్జిలపై గుంతలు పూడ్చాలి

గండ్రాతి నవీన్, వరంగల్, అండర్‌బ్రిడ్జి



వరంగల్ ఫ్లై ఓవర్‌బ్రిడ్జి, హంటర్‌రోడ్, చింతల్ బ్రిడ్జిలపై ఏర్పడిన గుంతల్ని పూడ్చాలి. అలాగే రోడ్లు, బ్రిడ్జిలపై సెంట్రల్ లైటింగ్, విద్యుత్‌దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రులు అంధకారంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జిలపై విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేయాలి.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

సాంబయ్య, ఖిలావరంగల్



వరంగల్ నగరంలోని ప్రధాన రహదారులపై, రద్దీ గల జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. రోడ్లపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. అతివేగంగా వెళ్లే వాహనాలు, త్రిపుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్‌పై చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్, సివిల్ పోలీసులు వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

గణేశ్ నవరాత్రి, నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

అధికారులతో మేయర్ సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 30: గ్రేటర్ వరంగల్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు బల్దియా వివిధ విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ.. నగరంలో గణేశ్ నిమజ్జనానికి 24క్రేన్‌లు, రెండు భారీ క్రేన్‌లను హైదరాబాద్ నుంచి తెప్పించనున్నట్లు వెల్లడించారు. నిమజ్జనానికి ఐదు రోజుల ముందే చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. గల్లీలతోపాటు ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి వేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాలైన చిన్నవడ్డెపల్లి చెరువు, కోట చెరువు, బంధం చెరువు, హసన్‌పర్తి చెరువు, సిద్ధేశ్వర గుండం వద్ద డిప్యూటీ కమిషనర్, స్థానిక అధికారులు ఇన్‌చార్జిలుగా ఉండాలని కోరారు. శానిటేషన్ సమస్య రాకుండా చూడాలన్నారు. మత్స్యశాఖ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయతో పని చేయాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా చూడాలన్నారు. కాగా, వినాయక మండపాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ అందచేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సుధారాణి చెప్పారు.

కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడు తూ.. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనులు, అంచనాలు ఏఈలు రూపొందించి ఇవ్వాలన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమజ్జనానికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖల సమన్వయంలో గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్ర మం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అద నపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డీసీలు కృష్ణారెడ్డి, రవీం దర్, ప్రసన్నరాణి పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలతో మహిళలు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కాశిబుగ్గ, ఆగస్టు 30: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వీఎస్.రాజు అన్నారు. బ్యూటీషియన్ కోర్సులో ఆరువారాల శిక్షణ పొందిన 31మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం శుక్రవారం సొసైటీ కాలనీలోని స్వశక్తి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జీవనోపాధి కోసం సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ముద్ర లోన్ల కోసం తన సహాయం తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ రావు, మాజనని ఉమెన్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు వడ్డేపల్లి మాధవి, డైరెక్టర్ సౌమ్య, ఆడెపు స్వప్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కాశిబుగ్గ, ఆగస్టు 30: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీ టీం హెడ్ కానిస్టేబుల్ సూర్యానారాయణ అన్నారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ హై స్కూల్‌లో శుక్రవారం షీ టీం బృందం విద్యార్థులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ సూర్యానారాయణ మాట్లాడుతూ అపరిచితులను విశ్వసించవద్దని సూచించారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమన్నారు. బాలికలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సైబర్ నేరాల బాధితులు 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు వేణు, స్వామి, ప్రవీణ్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



దత్తక్షేత్రంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 30: నగరంలోని ఆలయాల్లో శ్రావణ మాస సందడి నెలకొంది. శుక్రవారం ఆఖరి వెల్లివిరిసింది. చివరిశ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో మహిళలు సామూహికంగా పూజలు, లలితాపారాయణాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. దత్తక్షేత్రంలో లలితాసహస్ర పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీనివాస కాలనీలోని శృంగేరి శంకరమఠంలో శారద మాతకు అభిషేకం, విశేష పూజలు చేపట్టారు. హంటర్‌రోడ్డులోని సంతోషిమాతకు అభిషేకం, అలంకరణ, కుంకుమ పూజలు జరిగాయి. ఉపవాసాలతో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులందరికీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

ఆరో రోజుకు కుమార్‌గాడ్కే నిరాహార దీక్ష

గీసుగొండ, ఆగస్టు 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గీసుగొండలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్కే చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. శుక్రవారం న్యాయవాది కలకోటి మహేందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కేడల ప్రసాద్, సాయిబాబా, కొమురయ్య, హరినాథ్, ఐలయ్య, రమేష్‌లు దీక్షకు మద్దతు తెలిపారు.



డీఈవో జ్ఞానేశ్వర్‌కు డైరీని అందజేస్తున్న నాయకులు

టీచర్లు విద్యాభివృద్ధికి కృషి చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 30: ఉపాధ్యాయులు విద్యాభివృద్ధితోపాటు పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని వరంగల్ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ అన్నారు. ఇటీవలే వరంగల్ డీఈవోగా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్‌ను టీయూటీఎఫ్ నేతలు శుక్రవారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో జ్ఞానేశ్వర్ వారితో ముచ్చటిస్తూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించేందుకు పాటుపడాలన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ బడులవైపే చూసే విధంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం టీయూటీఎఫ్ నాయకులు వారి సంఘం రూపొందించిన డైరీని డీఈవోకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు, వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి కందకట్ల సత్యనారాయణ, మహిళా నాయకురాలు గోపాలదాస్ శ్రీవిద్య, ఆడెపు భిక్షపతి పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కాశిబుగ్గ ఏనుమాముల మార్కెట్ రోడ్డులో ఉన్న గుంతలో మట్టిని తొలగిస్తున్న కూలీలు


అధ్వానంగా రోడ్లు

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

వరంగల్ సిటీ, ఆగస్టు 30: అధ్వానంగా మారిన కాశిబుగ్గ - ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రోడ్డు మరమ్మతు పనులను శుక్రవారం అధికారులు చేపట్టారు. రోడ్డు దుస్థితిపై గత శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులు చేపట్టారు. బల్దియా అధికారులు కాశిబుగ్గ ఏనుమాముల మార్కెట్ రోడ్డులో ఉన్న గుంతలను పూడుస్తున్నారు. ఇందులో భాగంగా గుంతలలో పేరుకుపోయిన మట్టిని తొలిగించారు. సీసీ వేసి గుంతలను పూడ్చేందుకు పనులో నిమగ్నమయ్యారు.

'రిటైర్డ్ అసోసియేషన్' సభ్యుడి మృతి

వరంగల్ సిటీ, ఆగస్టు 30: రంగశాయిపేటకు చెందిన ఆజంజాహి మిల్లు మాడిఫైడ్ వలంటరీ రిటైర్డ్-02 వర్కర్స్ అసోసియేషన్ సభ్యుడు దారబోయిన సమ్మయ్య శుక్రవారం అనారోగ్యంతో తన నివాసంలో మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న అసోసియేషన్ అధ్యక్షుడు ఇనుముల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాజలింగం సమ్మయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 2021లోనే ఆజంజాహి మిల్లు మాడిఫైడ్ వలంటరి రిటైర్డ్ 2002 వర్కర్స్‌కు మిల్లు భూమిలోనే 200 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేన్నారు. ఇప్పటికే అసోసియేషన్ సభ్యులు వంద మంది వరకు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

వాగ్దేవికి అంతర్జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న వాగ్దేవి అసోసియేట్ డీన్ రాజు

శంభునిపేట, ఆగస్టు 30 : బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల వృత్తి నైపుణ్యం, సాంకేతిక పారిశ్రామీకరణలో చేస్తున్న ఒప్పంద ప్రాజెక్టులకు గాను అంతర్జాతీయ మొంగోడిబీ అకాడమిక్ పార్ట్‌నర్‌షిప్ అవార్డుకు ఎంపికైంది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన అకాడమిక్ లీడర్స్ కనెక్ట్ మీటింగ్‌లో కళాశాల రీసెర్చ్ అండ్ ఇండస్ట్రీ ఇంటరాక్షన్స్ అసోసియేట్ డీన్ చింతకింది రాజు అవార్డును అందుకున్నారు. ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ (ఐఐసీ) బృందం ఇంజనీరింగ్ విద్యార్థులను పరిశ్రమల అవసరాలు, అంచనాలు అందుకోవటానికి సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యాలను విస్తరించేందుకు వాగ్దేవి కళాశాల కలిసి ఒప్పంద ప్రాజెక్టులు చేస్తోంది. అందులో భాగంగా మొంగోడిబీ సెల్ఫ్ లర్నింగ్ అసైన్‌మెంట్‌లను కళాశాల నుంచి222 మందికిపైగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారని ప్రిన్సిపాల్ ప్రకాశ్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



కొండాకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

వరంగల్ సిటీ, ఆగస్టు 30: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. శుక్రవారం ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో కొండా ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కొండా మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, ప్రజలు నేరుగా సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

సంగెం, ఆగస్టు 30: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన తగినచర్యలు తప్పవని జడ్పీసీఈవో జి.రాంరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బందితో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, కార్యాలయ సూపరింటెండెంట్ ఓంప్రకాష్ పాల్గొన్నారు.



బోధనారీతులను మెరుగుపర్చుకోవాలి : డీఐఈవో

నర్సంపేట టౌన్, ఆగస్టు 30 : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు బోధనారీతులను మెరుగుపర్చుకొని విద్యార్థులకు బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈవో) డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలను శుక్రవారం డీఐఈవో సందర్శించారు. మొదట బాలికల జూనియర్ కళాశాలను సందర్శించి కళాశాలలోని రికార్డులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతరుల ఆర్థిక సహకారంతో కొనుగోలు చేసిన కెనాన్ ప్రింటర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కో-ఎడ్యుకేషన్ జూనియర్‌కళాశాలను సందర్శించి ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్లలో తలెత్తుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపుకోసం అధ్యాపకులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సంపత్‌కుమార్, సువర్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనుల ప్రతిపాదనలు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు పంపేందుకు తీర్మానం : మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్



మార్కెట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్

నర్సంపేట, ఆగస్టు 30 : వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తామని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం కమిటీ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అండర్ లైన్ వైరింగ్‌తో నూతనంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, రైతు విశ్రాంతి భవనంలో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం కోసం నిధుల మంజూరి కోసం కమిటీ సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానం చేశామన్నారు. అలాగే మార్కెట్ యార్డు కాంపౌండ్‌వాల్, గోదాములకు మరమ్మతులు, కలర్ వేసేందుకు, కార్యాలయంలో నూతన ఫర్నీచర్ కొనుగోలు కోసం తీర్మానం చేశామన్నారు.వాటర్‌ప్లాంట్ మార్చడం, మరమ్మతులు, మార్కెట్‌లో ఇంటర్‌నెట్ సౌకర్యం కోసం తీర్మానం చేశామన్నారు. యార్డులో, కార్యాలయంలో వృథాగా ఉన్న వస్తువులను విక్రయించడం కోసం టెండ ర్ ప్రకటన ఇస్తామన్నారు. మరుగుదొడ్ల మరమ్మతులు, కమీషన్ ఏజెంట్ల షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతులు, నాబార్డ్ గోదాముకు సీసీ రోడ్డు ఇరువైపులా వేయించ డానికి తీర్మానం చేశామన్నారు. సాధారణ కమిటీ సమావేశంలో చేసిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను డైరెక్టర్ ఆఫ్ మార్కెట్‌కు పంపించ డానికి తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ గోదాం పరిశీలన

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం వ్యవసాయ గోదామును శుక్రవారం మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్‌చైర్మన్ శాఖమూరి హరిబాబు, డైరెక్టర్లతో కలసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ హింగే రామారావు గోదాముకు కాంపౌండ్ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం, వేబ్రిడ్జి మరమ్మతులు చేయాలని చైర్మన్ శ్రీనివాస్‌ను కోరారు. సీసీ రోడ్డు, వేబ్రిడ్జి మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే పనులుచేపడతామని చైర్మన్ వెల్లడించారు. పరిశీలన చేసిన వారిలో డైరెక్టర్లు జక్క శ్రీను, కుమారస్వామి, అశోక్, సారంగపాణి, మధుకర్, జ్యోతి, కార్యదర్శి జి.రెడ్డి, సూపర్‌వైజర్ శివకుమార్ ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్ల తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నెక్కొండ, ఆగస్టు 30 : నెక్కొండ మండలం పెద్దకొర్పోలు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల అవరణలోని సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పచ్చని చెట్లు అల్లుకున్నాయి. ఈ విషయమై ఈ నెల 29న ఆంధ్రజ్యోతిలో గురుకుల పాఠశాలలో ప్రమాదకరంగా టాన్స్‌ఫార్మర్ అనే శీర్షికతో వార్త కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధితాధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు అల్లుకున్న చెట్లను శుభ్రం చేశారు.

నిర్వహణ బరువై.. నిఘా కరువై..

మరమ్మతుకు నోచుకోని నిఘా నేత్రాలు

నేరాల ఛేదనలో తప్పని తిప్పలు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 30 : పోలీసులకు సీసీ కెమెరాల నిర్వహణ బరువైంది. వెరసి మండలంలో సీసీ కెమెరాల నిఘా కరువైంది. కొన్ని నెలల నుంచి సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఆయా గ్రామాలపై పోలీసుల కన్ను సన్నగిల్లిందనే చెప్పాలి. ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పదే పదే పోలీసులు చెప్పే మాట. ఆ కెమెరాలు ఇప్పుడు పనిచే యక పోవడంతో ఇప్పుడునేరస్థుల ఛేదన సవాల్‌గా మారింది.

పోలీసులకు భారంగా నిర్వహణ

గత కొన్ని సంవత్సరాల క్రితం పోలీసులు ప్రజల సహకారంతో మండలంలోని ఆయా గ్రామాలతో పాటు వర్ధన్నపేట పట్టణంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పై ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వరకు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా కొంత దూరంలో పలు రహదారులు, కాలనీల వీధులు కనిపించేలా కెమెరాలను ఏర్పాటుచేశారు. ఇలా మండలంలోని దమ్మన్నపేట, ఉప్పరపెల్లి, ఇల్లంద, కట్ర్యాల, ఉప్పరపెల్లి క్రాస్, రామవరం, ల్యాబర్తి, నల్లబెల్లితోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. వాటి మానిటరింగ్ మొత్తం పూర్తిగా పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంచేశారు. అయా గ్రామాల ప్రధాన కూడళ్లలో జరిగే కార్యకలాపాలను చూసే విధంగా వాటిని ఏర్పాటు చేశారు. కానీ, రోజులు గడుస్తున్న కొద్ది ఈ కెమెరాల నిర్వహణ పోలీసులకు భారంగా మారింది. వైరింగ్ ఏర్పాటు చేయడం, కెమెరాల మరమ్మతులు, కోతులు తెంపిన చోట్ల తిరిగి పునరుద్ధరించడం లాంటి నిర్వహణ లేకపోవడంతో సీసీ కెమెరాలు నామమాత్రంగా స్తంభాలకు వేలాడుతున్నాయి.

నేరస్థుల గుర్తింపులో కీలక పాత్ర

నేరస్థుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. పాత నేరస్థులతో పాటు కొత్త నేరస్థుల గుర్తింపు సైతం కెమెరాల ద్వారా సులువుగా ఉండేది. నేరం జరిగిన చోటులో పాల్గొన్న వ్యక్తిని గంటల వ్యవధిలోనే కనిపెట్టేవారు. గతంలో నేరాలకు పాల్పడి ఉంటే ఆ వ్యక్తి వివరాలు సేకరించడంతో పాటు కొత్త వ్యక్తులకు ఫొటోలను ప్రజల కోసం రిలీజ్ చేసి అప్రమత్తం చేసేవారు. కానీ, ప్రస్తుతం కెమెరాలు పనిచేయకపోవడంతో నేరస్థులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఇటీవల పట్టణంలో పలు షాపుల్లో, ఇండ్లలో దొంగలుపడ్డారు. గతంలో మండలంలోని ఇల్లంద రాజరాజేశ్వరి ఆలయంలో సైతం దొంగలుపడడం పోలీసులకు ఇప్పుడు తలనొప్పిగా మారింది. జాతీయ రహదారిపై రోడ్డు పక్కన పెట్టిన ద్విచక్ర వాహనాలను సైతం గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేస్తున్నారు. కెమెరాలు పనిచేయకపోవడంతో ఇప్పుడు వీరిని గుర్తించడం పోలీసులకు తలనొప్పిగా మారింది.

గ్రామాల్లో కమిటీలు వేస్తాం

కొమ్మూరి శ్రీనివాస రావు, సీఐ, వర్ధన్నపేట



వర్ధన్నపేట సర్కిల్ పరిధిలో ఉన్న వర్ధన్నపేట, రాయపర్తి, జఫర్‌ఘడ్ మండలాల్లో ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలపై ఆరా తీస్తున్నా. పూర్తిగా నివేదికలు అందాక ఉన్నతాధికారుల సూచనలతో గ్రామ కమిటీలు వేయాలనే ఆలోచనలో ఉన్నాం. గ్రామసభల ద్వారా సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి, గ్రామాల్లో ఉన్న ప్రముఖులను కమిటీలో భాగస్వాములను చేస్తాం. వారందరు గ్రామస్థుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో పోలీసుల ప్రమేయం లేకుండా ఫండింగ్ ఏర్పాటు చేసుకునేలా నిర్ణయం చేయాలని చూస్తున్నాం. పారదర్శకం గా ఆ కమిటీనే కెమెరాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలు చూసేలా చేసి, కమిటీ సూచినల మేరకు గ్రామాల్లో ఎక్కడెక్కడ కెమెరాలు ఏర్పాటు చేయాలో నిర్ణయించి ముందుకు వెళ్తామని అనుకుంటున్నాం.



ప్రజలు, దాతలు సహకరించాలి

ఇటీవల కాలంలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులు సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజ్‌లు పోలీసులకు లభించకుండా లోపల అమర్చుతున్న డీవీఆర్‌లను సైతం ఎత్తుకెళ్లిపోతున్నారు. ఈ తరుణంలో ఆయా గ్రామాల ప్రజలు, దాతలు పోలీసులకు సహకరించాల్సిన అవసరంఉంది. దీనికోసం వివిధ వాణిజ్య, వ్యాపార సంస్థలు, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు, ఇండస్ట్రీయల్ వ్యాపారులు ముందుకు వచ్చి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారిపై ఎన్నో వ్యాపార సంస్థలు నడుస్తున్నాయి. వారిలో ప్రతీ ఒక్కరు ఒక కెమెరాను తమ బిల్డింగ్‌కు జాతీయ రహదారి కనపడే విధంగా అమరిస్తే నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించినట్లవుతుందని చెపుతున్నారు. గ్రామానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఏ దారి గుండా రాకుండా, వెళ్లకుండా తమ ఇంట్లో ఉన్న కెమెరాను రోడ్డు కనిపించే విధంగా పెడితే సత్ఫలితాలు సాధించవచ్చు.

రేషన్ బియ్యం పక్కదారి

పేదల నుంచి కిలో రూ.13 కొనుగోలు

రాష్ట్రం దాటించి కోట్లు దండుకుంటున్న వ్యాపారులు

వర్ధన్నపేట, ఆగస్టు 30 : పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న బియ్యం పక్కదారి పడుతోంది. వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉదయం నుంచి వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.13 నుంచి రూ.15వరకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యం మధ్యవర్తి వ్యాపారికి రూ. 20 విక్రయిస్తున్నారు. అనంతరం ఆ వ్యాపారి బడా వ్యాపారులకు రూ.25వరకు విక్రయించుకుంటున్నాడు.ఇలా పేదల బియ్యం పెద్దల పాలవుతున్నాయి. ప్రతీనెలా ఒకటవ తేదీనుంచి 15వ తేదీ వరకు పల్లెల్లో రేషన్ బియ్యం కొనుగోళ్లు యథేచ్ఛగా కొనసాగుతుంది. వ్యాపారులు నేరుగా రేషన్ బియ్యాన్ని మండల కేంద్రానికి తరలిస్తున్నారు. అక్కడ నుంచి రాత్రి సమయాల్లో డీసీఎం వాహనాల్లో ఇతర ప్రాంతాలకు అమ్మేందుకు తరలిస్తున్నారు.

రేషన్ దుకాణాల నుంచే..

కొన్ని రేషన్ షాపుల నుంచే నేరుగా బియ్యం వ్యాపారుల వద్దకు చేరుతున్నాయి. గ్రామాల్లో దాదాపుగా అందరికీ రేషన్ కార్డులు ఉన్నాయి. పదెకరాల వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ రేషన్‌కార్డు ఉంది. కానీ, అలాంటి వారు రేషన్ బియ్యం తీసుకోరు. రేషన్‌ను నేరుగా రేషన్‌డీలర్‌కు కిలోకు రూ.10చొప్పున విక్రయిస్తున్నారు. అనంతరం రేషన్ డీలర్లు వ్యాపారులకు రూ.15 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా మండలంలో రేషన్ దందా దర్జాగా సాగుతోంది. ఇలా సేకరించిన బియ్యాన్ని వ్యాపారులు రాష్ట్రం దాటిస్తూ కోట్లు ఘడిస్తున్నారు. రేషన్ డీలర్లపై అధికారులు నిఘా లేకపోవడంతో బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్‌దందాకు చెక్‌పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



మహబుబ్‌నాయక్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నెక్కొండ, ఆగస్టు 30 : ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశ పెడుతున్న పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని నెక్కొండ మండల విద్యాశాఖధికారి వి.రత్నమాల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హంస నరేందర్ కోరారు. శుక్రవారం మండలంలోని మహబుబ్‌నాయక్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు ప్రతీ ఒక్కరు ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. అంబేడ్కర్ కలలు కన్న సమాజ నిర్మాణంలో, అంటరానితన నిర్మూలనలో యువత భాగస్వాములుకావాలని కోరారు.అనంతరం అంటరానితన నిర్మూలనకు కృషి చేస్తామంటూ ప్రజలచేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, పంచాయతీ కార్యదర్శి కె.నాగార్జున, వివిధ శాఖల అధికారులు రాజేంద్రప్రసాద్, రాజేశ్, నాగలక్ష్మి, సైదమ్మ, దేవేందర్, మంజుల, భూక్య నరేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఖానాపురం: రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌ఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చిలుకమ్మ నగర్‌లో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే చట్టాలుఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర, సభ్యు డు పాలకుర్తి విజయ్, హెచ్‌డబ్ల్యూవో రామగిరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.
- దుగ్గొండి: ప్రభుత్వ పథకాలు అందిరికి చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అరుంధతి అన్నారు. మండలంలోని మదిర దళితకాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించగా ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. కార్యక్ర మంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆర్‌ఐ రాంబాబు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో పోలీసు కార్డెన్ సెర్చ్

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 30 : మండలంలోని నల్లబెల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా కార్డెన సర్చ్ నిర్వహించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో గ్రామంలో తనిఖీలు చేయగా, సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, బెల్టు షాపుల్లో మద్యం, గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు లభించినట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస రావు,ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



భరత్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 30 : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఇల్లందలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన వేల్పుల భరత్ (28) అనే యువకుడు గత సంవత్సరం అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా భార్యాభర్తలిద్దరు గ్రామానికి చేరుకోగా, తిరిగి వెళ్దామని భార్యను కోరగా అందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన భరత్ ఈ నెల 25న తన ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు గురువారం రాత్రి మృతిచెందినట్లుగా వైద్యులునిర్ధారించారు. మృతుని తండ్రి వేల్పుల కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు అందించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహనికి పోస్టుమార్టంచేసి కుటుంబ సభ్యులకు అందించారు.

3న ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఎన్నికలు

నల్లబెల్లి, ఆగస్టు 30 : సెప్టెంబర్ 3న ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా ఎలక్షన్లు జరుగుతాయని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గండె శ్రీనివాస్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ప్రక్రియ, సెప్టెంబర్ 2న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 3న ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా ఎలక్షన్లు జరుగుతాయని తెలిపారు. ఈ ఎలక్షన్స్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

వర్ధన్నపేట, ఆగస్టు 30 : పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ జోనా కోరారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో డ్రైడేను పురస్కరించుకొని పలు వార్డుల్లో పర్యటించారు. ప్రజలకు పరిసరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జోనా మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలను తీసుకోవాలని, పరిసరాల్లో నీటి నిల్వ ఉంచుకోవద్దని అన్నారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో సభ్యత్వమున్న రైతుల రికార్డు కావాలి

నల్లబెల్లి పీఏసీఎస్‌ను ఆదేశించిన రాష్ట్ర అధికారులు



పీఏసీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్రస్థాయి అధికారులు

నల్లబెల్లి, ఆగస్టు 30 : నల్లబెల్లి పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న ప్రతీ రైతు రికార్డు కావాలని రాష్ట్ర అడిట్ అసిస్టెంట్ రిజిస్టర్లు రవిచంద్ర, కరీంపాషలు పీఏసీఎస్ చైర్మన్, సస్పెండ్ అయిన సీఈవోలను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర, కరీంపాషలు మాట్లాడుతూ నల్లబెల్లి పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న 2,100ల రైతుల మొత్తం రికార్డులు కావాలని, అలాగే లోన్ పొందిన రైతుల వివరాలు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, క్యాష్ బుక్ లేజర్స్, లోను పొందిన రైతుల రికార్డులు సమగ్రంగా ఉండాలని తెలిపారు. తాము మళ్లీ వస్తామని, నాలుగు రోజుల్లో రికార్డులు సిద్ధంచేసి ఉంచాలని చైర్మన్, సస్పెండ్ అయిన సీఈవోలను ఆదేశించారు.

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 30 : బీజేపీని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని సభ్య నమోదు ఇన్‌చార్జ్ శ్రీరాం భూపాల్, మండల పార్టీ అధ్యక్షుడు రాయపురం కుమారస్వామిలు అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లందలో సభ్యత్వ నమోదు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ప్రతీ బూత్‌లోను 200 మందిని సభ్యులుగా చేర్పే బాధ్యతలు కార్యకర్తలు తీసుకోవాలన్నారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒకరు చురుకుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సతీష్‌రెడ్డి, మహేందర్, పెద్దూరి రాజు, కంటిగిరి మైస రాము, పీఏఎస్ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

రాయపర్తి, ఆగస్టు 30 : యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ముందుకు సాగాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహ్మద్ సైఫ్ అలీ ఇంజనీరింగ్ వెల్డింగ్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని నమ్మబలికి యువత జీవితాలకు ఆగం చేసుకోవద్దన్నారు. స్వయం ఉపాధి మార్గాలతో ఆర్థికంగా ఎదిగి నలుగురిలో మంచి జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారపదార్థాల పరిశీలన

గీసుగొండ, ఆగస్టు 30 : హోటల్స్‌లోని ఆహార పదార్థాలను, టీ పౌడర్‌లను ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ చేవూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేశారు. అనంతరం వంచనగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, మోడల్ స్కూల్స్‌లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ మూర్తి మాట్లాడుతూ నాసిరకం, కల్తీ ఆహార పదార్థాలను వాడవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్ పాల్గొన్నారు.

అన్నదాతల యూరియా లైన్లు

రాయపర్తి, ఆగస్టు 30 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట శుక్రవారం అన్నదాతల యూరియా కోసం బారులు తీరి కనిపించారు. ఉదయం నుండే లైన్లలో నిలబడి రైతులు నానా తంటాలు పడ్డారు. ప్రభుత్వం అందించే యూరియా పీఏసీఎస్ కేంద్రాల ద్వారా అందిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రస్తుత విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గీసుగొండ, ఆగస్టు 30 : మొగిలిచర్ల జెడ్పీ పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు అవసర మైన వసతులను అడిగి తెలుసుకున్నారు. వసతుల కల్పనకు పూర్వవిద్యార్థులు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు తానం మనోహర్‌రావు, పోలం జయపాల్‌రెడ్డి, డాక్టర్ పోరండ్ల కిషన్, పొలం సత్యనారాయణరెడ్డి, కైలాస భాస్కర్, సదానందం, నరసయ్య, కామగోని రఘుపతి, ప్రేమ్‌సాగర్, ఆడెపు రమేష్ పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో భారీ వర్షం

చెన్నారావుపేట, ఆగస్టు 30 : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. పదిహేను రోజులుగా గ్రామాల్లో వర్షంలేక వేసిన పంటలకు సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురువ డంతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు సాగు నీరందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

సంగెం, ఆగస్టు 30 : ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన తగిన చర్యలు తప్పవని జడ్పీసీఈవో జి.రాంరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీచేసి, సిబ్బందితోచర్చించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, కార్యాలయ సూపరింటెండెంట్ ఓంప్రకాష్ పాల్గొన్నారు.

బొమ్మెర రవికుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



రాయపర్తి, ఆగస్టు 30 : మండలంలోని పెర్కవేడుకు చెందిన బొమ్మెర రవి కుమార్‌కు శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. జేఎన్‌టీ యూ పరిధిలోని శ్రీనిధి కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సింథసిస్ యాంటీ క్యాన్సర్ ఎవల్యూషన్ అండ్ డాకింగ్ స్టడీస్ ఆఫ్ ఆక్సిజోల్ ఇండోల్ పైరిమిడిన్ అండ్ బెంజ్ ఆక్సిల్ ఆల్ డెరివేటివ్ అనే అంశంపై రవికుమార్ పరిశోధనచేశారు. దీంతో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అరుణ కుమారి పీహెచ్‌డీ ప్రకటించారు. 2002లో పీజీ పూర్తిచేసి పరిశోధనలపై ఉన్న మక్కువతో కెమికల్ లాబోరేటరీలలో కెమిస్ట్‌గా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. 2013లో శ్రీనికోలస్ అనే రసాయన పరిశ్రమను సొంతంగా హైదరాబాద్‌లోని బాలానగర్‌లో స్థాపించి ఎంతో మంది యువతకు ఉపాధి కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. రవి కుమార్‌కు డాక్టరేట్ లభించిన సందర్భంగా కెమిస్ట్రీ విభాగ అధిపతి డాక్టర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ రమాదేవి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ సవిత, డాక్టర్ తిరుమలాచారి, నాగపూర్ ఎన్ఐటీ ప్రొఫెసర్ సురేష్, పర్యవేక్షకులు డాక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ఖానాపురం, ఆగస్టు 30: నర్సంపేట మెడికల్ కళాశాల ఆస్పత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ప్రకాశ్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నర్సంపేట మెడికల్ కళాశాల ప్రత్యేక వైద్య నిపుణులు ద్వారా బుధరావుపేటలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ ప్రకాశ్ ప్రారంభించారు. మెడికల్ కళాశాల నర్సంపేటలో ఏర్పాటు కావడంతో ఏ ఆరోగ్య సమస్యకైనా ప్రత్యేక వైద్య నిపుణుల ద్వార చికిత్స పొందడం జరుగుతుందని, ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ ప్రకాశ్ సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట వైద్య కళాశాల ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ పూనమ్ కుమారిఝా, అసోసియేట్ ప్రొఫెసర్ సుజాత, పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

రాయపర్తి, ఆగస్టు 30 : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మామిడాల ప్రశాంత్ కొన్ని నెలలుగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ అధినేత పరిపాటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధితుడికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో లేతాకుల మహేందర్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు ఆమరణ నిరాహార దీక్ష

గీసుగొండ, ఆగస్టు 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గీసుగొండలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గే చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. శుక్రవారం న్యాయవాది కలకోటి మహేందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కేడల ప్రసాద్, సాయిబాబా, కొమురయ్య, హరినాథ్, ఐలయ్య రమేష్‌లు దీక్షకు మద్దతు తెలిపారు.

మండపాలకు ఉచిత విద్యుత్ హర్షణీయం

గీసుగొండ, ఆగస్టు 30 : గణేష్ నవరాత్రుల సందర్భంగా మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన గీసుగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేవిధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలను కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూసం రమేష్, ఆకుల రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కాట్రపల్లిహవేలిలో విగ్రహాల ప్రతిష్ఠ

సంగెం, ఆగస్టు 30 : కాట్రపల్లి హవేలిలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శనివారం అభయాంజనేయ, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠ నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు సుందరసత్సంగ్ ఆధ్వర్యంలో ఉదయమర్రి కృష్ణ మూర్తిశర్మ, కొడకండ్ల శ్రీనివాసాచార్యులు, కొడకండ్ల శ్రీకాంతా చార్యులు నిర్వహించారు. నిత్యపూజ, మూలమంత్ర హవనం నిర్వహించారు.అలాగే విగ్రహమూర్తులకు ధాన్యాధివాసం, ఫలపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు.

దాతల సహకారంతో నిర్మించిన ఆలయాల్లో శనివారం అభయ యాంజనేయ, పోచమ్మ విగ్ర హాలను ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు గోగుల రాజేందర్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.